డేంజరస్ డారియన్ గ్యాప్

అగ్రదేశం వెళ్లేందుకు వలసదారుల దొడ్డిదారి

ప్రమాదకరం-ప్రాణాంతకం

న్యూఢిల్లీ: దొడ్డిదారిన అమెరికాలోకి ప్రవేశించాలనుకొనే వారు అనేక దేశాలు, ప్రమాదకర అడ్డంకులు, భయానక డారియన్ గ్యాప్ అడవిని దాటుకొని వెళ్లాల్సి ఉంటుందని ఏపీ వార్తా సంస్థ తెలిపింది. కొలంబియా, పనామా దేశాల మధ్య 97 కిలోమీటర్ల అటవీ మార్గాన్ని డారియన్ గ్యాప్ అంటారు. డారియన్ గ్యాప్ అంతటా దట్టమైన వర్షారణ్యాలు, చిత్తడినేలలు, కొండలే ఉంటాయి. అలాస్కా నుంచి అర్జెంటీనా వరకున్న పాన్ అమెరికన్ హైవేలో ఇదొక్కటే ప్రధాన ఆటంకం. దట్టమైన అడవి, కఠినమైన వాతావరణ పరిస్థితులు, ఎటువంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ఈ మార్గాన్ని ఎవరూ ఉపయోగించరు. కానీ ఎట్లాగైనా అమెరికాలో కాలుమోపాలనుకునే వారికి ఇదొక్కటే దొడ్డిదారి. ఈ అడవి అంతటిలో ఎత్తయిన కొండలు, బురద నేలలే కాకుండా వేగంగా ప్రవహించే నదులు, క్రూర మృగాలను దాటుకుంటూ వెళ్లాలని ఏపీ వార్తా సంస్థ తెలిపింది. ఈ అడవిలో విష సర్పాలు, చిరుతపులులు, ప్రాణాంతక కీటకాలు ఉంటాయి. ఇక స్మగ్లర్లు, డ్రగ్ మాఫియా ఈ మార్గంలో వెళ్లే వలసదారులను దోచుకొంటుందని, లైంగికంగా వేధిస్తుందని పేర్కొంది.

డంకీ రూట్‌లో భారతీయులు

అమెరికాకు అక్రమంగా వెళ్లాలనుకునే భారతీయులు ఎక్కువగా డంకీ రూట్ ఉపయోగిస్తారట. ముందుగా వీరు వీసాలు సులభంగా లభించే దక్షిణ అమెరికన్ దేశాలకు వెళతారు. అక్కడి నుంచి మెక్సికోకు ప్రయాణమై అపై కయోట్స్ (మనుషులను స్మగ్లింగ్ చేసే ముఠాల) సాయంతో అమెరికాలో చొరబడేందుకు ప్రయత్నిస్తారు.

కాళ్లు, చేతులకు సంకెళ్లేసి

- **భారత వలసదారులపై అమెరికా అమానుషం**
- **కిక్కురుమనని కేంద్రం**

న్యూఢిల్లీ: కరడుగట్టిన నేరస్తుల్లా చేతులు, కాళ్లకు సంకెళ్లు.. సరుకుల రవాణాకు ఉపయోగించే సైనిక విమానాల్లో వారిని మూటల్లా కుక్కేసి సుమారు 30 గంటలకు పైగా ప్రయాణం.. ఇది మన దేశ వలసదారుల తరలింపుపై అమెరికా చూపిన అమానుష వైఖరి. ఒక వైపు భారత్‌తో తమకు స్నేహ సంబంధాలున్నాయని చెప్పుకునే అమెరికా... మనవారిని అవమానకరంగా, అమానవీయంగా మన దేశానికి పంపింది. అమెరికా తీరుపై భారత్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అయ్యింది. అటు విపక్షాలు, వివిధ వర్గాలు అగ్రరాజ్యం తీరును తప్పుబట్టాయి. ఉభయ సభల్లోనూ దీనిపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేంద్రాన్ని నిలదీశాయి. భారతీయులకు సంకెళ్లు వేసి ఉన్న వీడియోలు బుధవారమే వైరల్ కాగా, అవి భారతీయులవి కావని కేంద్రం బుకాయించింది. అయితే గురువారం స్వయంగా బాధితులే తమకు బేడీలు వేసి అమానుషంగా విమానంలో తీసుకువచ్చారని, దారిలో చిత్రహింసలు పెట్టారని ఆరోపించడంతో నిజాలు వెలికివచ్చాయి. తమను విమానం ఎక్కించే వరకు ఎక్కడికి వెళ్తున్నామో కూడా చెప్పలేదని తెలిపారు. ఇంత జరిగినా అమెరికా వైఖరిపై కేంద్రం పల్లెత్తు మాట కూడా అనకపోవడం, పైగా వారి చర్యను చట్టసభలో కేంద్ర మంత్రే సమర్థించడం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తున్నది. కొలంబియా లాంటి దేశంకు ఉన్న తెగువ, ధైర్యం మన మోదీకి లేవా అని ఈ సందర్భంగా విపక్ష నేతలు బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీశాయి.

కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి ఉంచారు

అమెరికా నుంచి సైనిక విమానం ద్వారా తొలి విడతగా భారత్ చేరుకున్న 104 మంది వలసదారులలో 19 మంది మహిళలు, 13 మంది మైనర్లు కూడా ఉన్నారు. వీరిలో నాలుగేండ్ల బాలుడు, ఐదు, ఏడేండ్ల వయసున్న బాలికలు ఉన్నారు. వారిలో ఉన్న జస్పాల్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ తాము విమానంలో ప్రయాణిస్తున్నంత సేపూ తమ కాళ్లూ, చేతులూ సంకెళ్లతో బంధించారని, విమానం అమృత్‌సర్‌లో ల్యాండయిన తర్వాత మాత్రమే వాటిని తొలగించారని తెలిపాడు. తాను కూడా ఏజెంట్‌కు రూ.30 లక్షలు ఇచ్చానని చెప్పాడు. తొలుత తనను బ్రెజిల్ తీసుకుని వెళ్లారని, జనవరి 24న అమెరికా సరిహద్దు పెట్రోలింగ్ సిబ్బంది తనను అరెస్ట్ చేసేవరకు అక్కడ ఆరు నెలలు ఉన్నానని వెల్లడించాడు. వలసదారుల్లో ఉన్న తన కుమార్తె గురించి కనూభాయి పటేల్ అనే మహిళ మాట్లాడుతూ నెల రోజుల క్రితం తన కుమార్తె తన స్నేహితులతో కలిసి యూరప్ వెళ్లిందని, అక్కడి నుంచి అమెరికా ఎలా వెళ్లిందో తనకు తెలియదని అన్నారు.

అది మా విధానం.. అమెరికా

తమ దేశం, ప్రజల భద్రత కోసం ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేయడం అవసరమని, అది తమ విధానమని యూఎస్ స్పష్టం చేసింది. విమాన ప్రయాణం గురించి అంతకు మించి చెప్పలేమని వ్యాఖ్యానించింది. కాగా, భారత్‌కు చెందిన 104 మంది వలసదారుల కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి ఉన్న వీడియోను యునైటెడ్ స్టేట్స్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటక్షన్ (యూఎస్‌బీపీ) చీఫ్ మైఖేల్ బ్యాంక్స్ విడుదల చేశారు.

వారు భారతీయులు కాదు

భారత వలసదారుల చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసి ఉన్న చిత్రాలు వైరల్ కావడంతో కేంద్ర వైఖరిపై పలువురు విమర్శలు గుప్పించారు. ఇది రాజకీయ వివాదానికి దారి తీయడంతో ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ చేపట్టింది. నిజ నిర్ధారణ చేపట్టి అవి ఫేక్ అని తేల్చింది. ఆ ఫొటోల్లో ఉన్న వారు భారతీయులు కాదని, గ్వాటమాకు పంపిస్తున్న వలసదారులని పేర్కొంది.

కేంద్రం ఏం చేస్తున్నది?

- **అమెరికాకు విమానాలను ఎందుకు పంపలేదు?**
- **పౌరుల మర్యాద కన్నా.. యూఎస్ విధానాలే ముఖ్యమా: విపక్షాలు**

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన వలసదారులను తీసుకురావడానికి భారత్ విమానాలను ఎందుకు పంపలేదని మోదీ ప్రభుత్వాన్ని విపక్షాలు నిలదీశాయి. 104 మంది కాళ్లు, చేతులకు బేడీలు వేసి అవమానకర రీతిలో అమానవీయంగా భారత్‌కు తీసుకువచ్చారని, మన పౌరుల పట్ల చూపే మర్యాద ఇదేనా? అని ప్రశ్నించాయి. వారిని అవమానించకుండా మర్యాదగా దేశానికి తీసుకురావడంతో ప్రభుత్వం విఫలమైందని విమర్శించాయి. పార్లమెంట్ ఉభయసభల్లో గురువారం దీనిపై రగడ జరగింది. దీనిపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ నేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ తదితరులు వలసదారుల పట్ల అనుసరించిన అవమానకర వైఖరిని తప్పుబట్టారు. అక్రమ వలసదారులను బహిష్కరించడం అమెరికా హక్కయినప్పటికీ, వారిని పంపిన విధానాన్ని తాము నిరసిస్తున్నామని కాంగ్రెస్ నేత శశిథరూర్ విమర్శించారు. ఇది ప్రభుత్వ బలహీనతను తేటతెల్లం చేస్తున్నదని విమర్శించారు. దీనిపై ప్రభుత్వం తగిన సమయంలో స్పందిస్తుందని, దీనిని రాజకీయం చేయడం విపక్షాలకు తగదని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ అన్నారు. సభలో కొందరు సభ్యులు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు.

రాజ్యసభలోనూ..

రాజ్యసభలోనూ ఈ అంశంపై తీవ్రంగా చర్చ జరిగింది. సీపీఐ, టీఎంసీ, ఆప్, సీపీఐ(ఎం) ఎంపీలు దీనిపై చర్చకు నోటీసులు ఇచ్చారు. అయితే చైర్మన్ ధన్‌ఖడ్ వీటిని తిరస్కరించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ మన పౌరులను సంకెళ్లు వేసి తీసుకురావడం మనసు కలిచివేసిందని, మనకంటే ఎన్నో రెట్లు చిన్నవైన కొలంబియా లాంటి దేశాలు తమ విమానాలు అమెరికాకు పంపి తమ పౌరులను గౌరవంగా తమ దేశానికి తీసుకువచ్చాయని, భారత్ ఆ పని ఎందుకు చేయలేకపోయిందని నిలదీశారు. మన పౌరుల ప్రయోజనాలు, గౌరవం కన్నా అమెరికా బహిష్కృత పాలసీని సమర్థించడానికే మంత్రి జైశంకర్ ప్రాధాన్యం ఇస్తున్నట్టు కన్పిస్తున్నదని ఆరోపించారు.

శవాల మధ్య మైళ్లకొద్దీ నడిచాం!

- ***చీకటి కారాగారాల్లో నెలల తరబడి మగ్గాం***
- ***లక్షలు ఖర్చు చేసి వెళ్లాం***
- ***కట్టుబట్టలతో మిగిలాం***
- ***వలసదారుల ఆవేదన***

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: డాలర్ డ్రీమ్స్ చెదిరాయి.. లక్షల డాలర్లు సంపాదించాలనుకున్న కలలు కల్లలయ్యాయి. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా అగ్రరాజ్యంలోకి తాము సాగించిన జీవన పోరాటం తీవ్ర ఖేదాన్ని మిగిల్చింది. కరడుగట్టిన ఖైదీలకు వేసినట్టుగా కాళ్లు, చేతులకు బేడీలతో అవమానకర రీతిలో మాతృగడ్డపైకి పంపడం మరింత కుంగదీసింది. అమెరికా బహిష్కరించి బలవంతంగా సైనిక విమానంలో పంపేయడంతో బుధవారం అమృత్‌సర్‌కు చేరుకున్న 104 మంది భారతీయుల ముఖాల్లో తీవ్ర ఆవేదన, భవిష్యత్తుపై బెంగ కన్పించింది.

బియ్యం తిని బతికాం..

యూఎస్-మెక్సికో సరిహద్దులో చీకటి గదుల్లో తాము అనుభవించిన నరకాన్ని తలచుకుని కొందరు కన్నీళ్లు పెట్టుకున్నారు. పంజాబ్‌లోని హోషియాపూర్ జిల్లా తాహిల్ గ్రామానికి చెందిన హర్వీందర్ సింగ్ మాట్లాడుతూ యూఎస్‌లో వర్క్ వీసా ఇప్పిస్తానని చెప్పిన ఒక ఏజెంట్‌ను నమ్మి రూ.42 లక్షలు చెల్లించానని చెప్పాడు. అయితే ఆఖరి నిమిషంలో తనకు వీసా రాలేదని చెప్పారని, అయితే ఎలాగైనా అమెరికా చేరుస్తామని చెప్పి తొలుత ఢిల్లీ నుంచి ఖతార్‌కు, అక్కడి నుంచి బ్రెజిల్‌కు తీసుకు వెళ్లారన్నారు. టాక్సీలు తమను కొలంబియాకు తీసుకువెళ్లాయని, అక్కడి నుంచి పనామాకు వెళ్లామన్నారు. సముద్రంపై చిన్న బోటులో నాలుగు గంటల పాటు ప్రయాణం సాగిన తర్వాత పడవ బోల్తా పడగా, తమతో ఉన్న ఒక వ్యక్తి మరణించారని తెలిపారు. మరో వ్యక్తి పనామా అడవిలో కన్నుమూశాడన్నారు. అంతకాలం తాము కొద్దిపాటి బియ్యం తిని బతికామని వెల్లడించాడు.

దారి నిండా శవాలే..

దారాపూర్ గ్రామానికి చెందిన సుఖ్‌పాల్ సింగ్ కూడా ఇదే తరహా అనుభవాన్ని వెల్లడించాడు. చిన్న పడవలో 15 గంటల పాటు సముద్ర ప్రయాణం చేసిన తర్వాత, లోతైన ప్రమాదకరమైన కొండ లోయలలో 45 కి.మీ కాలినడకన బిక్కుబిక్కుమంటూ వెళ్లినట్టు తెలిపాడు. ఈ క్రమంలో ఎవరైనా గాయపడితే వారిని అలాగే వదిలేసేవారని, ఇంత కష్టపడి ప్రయాణం చేసినా యూఎస్‌లోని ప్రవేశించడానికి సరిహద్దును దాటడానికి ముందు తనను పోలీసులు మెక్సికోలో అరెస్ట్ చేశారన్నారు. 14 రోజుల పాటు తమను చీకటి కొట్టాల్లాంటి సెల్‌లో బంధించారని, జీవితంలో తిరిగి సూర్యుడి వెలుగును చూస్తానని అనుకోలేదని తెలిపాడు.అమెరికా వెళ్లేవారు దయుంచి తనలా అక్రమ మార్గాల్లో వెళ్లవద్దని సుఖ్‌పాల్ సింగ్ విజ్ఞప్తి చేశారు.

లక్షలు అప్పు చేసి పంపించాం

కపుర్తలాలోని బెహబాయి బహాడేకు చెందిన గురప్రీత్ సింగ్ తమ ఇంటిని తాకట్టు పెట్టి అప్పు చేసి అమెరికా వెళ్లాడు. అలాగే జస్వీందర్ సింగ్ కుటుంబ సభ్యులు అతడిని పంపడానికి 50 లక్షలు ఖర్చు చేశారు.

వలస విధానంపై కొత్త చట్టం

విదేశాంగ మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ: వలసల విధానంపై కొత్త చట్టం తెస్తామని కేంద్రం ప్రకటించింది. వలసదారుల తరలింపు విధానంపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేయడంతో కేంద్రం కొత్త చట్టాన్ని అమలుచేయాలని పరిశీలిస్తున్నది. దీనిని తాత్కాలికంగా ఓవర్సీస్ మొబిలిటీ బిల్లు-2024 అని పేరు పెట్టారు. ఈ చట్టం విదేశీ ఉపాధి కోసం సురక్షితమైన, క్రమబద్ధమైన వలసలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఇదేం కొత్త విషయం కాదు..

వలసదారుల తరలింపుపై అమెరికా అనుసరించిన విధానాన్ని కేంద్రం సమర్థించుకుంది. విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ రాజ్యసభలో మాట్లాడుతూ అమెరికా నుంచి వలసదారుల తరలింపు కొత్త విషయం కాదని అన్నారు. వలసదారుల పట్ల దురుసుగా వ్యవహరించవద్దని తాము ఆ దేశాన్ని కోరామన్నారు. విదేశాల్లో అక్రమ వలసదారులుగా గుర్తించిన భారతీయులను మన దేశానికి వెనక్కి రప్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అయితే అక్రమ వలసదారుల బహిష్కరణ ప్రక్రియను అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2012 నుంచి కొనసాగిస్తున్నదని చెప్పారు. వారి ప్రామాణిక నిర్వహణా విధానం ప్రకారం నిర్బంధ విధానాలు అనుసరిస్తారని, అయితే మహిళలు, పిల్లల పట్ల ఆ విధానం అనుసరించవద్దని తాము కోరామన్నారు. ఎప్పటికప్పుడు యూఎస్ అధికారులతో టచ్‌లో ఉన్నామన్నారు. చట్టబద్ధమైన చర్యను ప్రోత్సహిస్తూనే చట్టవిరుద్ధ పనులను నిరుత్సాహ పరిచినట్టు ఆయన చెప్పారు.

'బంగ బంధు' నివాసానికి నిప్పు

ఢాకా: బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రహమాన్ చారిత్రక నివాసంపై బుధవారం మూక దాడి జరిగింది. దుండగులు ఈ బంగళాకు నిప్పు పెట్టి, విధ్వంసం సృష్టించారు. పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా.. అవామీ లీగ్ పార్టీ ఫేస్‌బుక్ పేజ్‌లో భావోద్వేగంతో స్పందించారు. బంగళాను తుడిచిపెట్టేసినప్పటికీ, తన తండ్రి చరిత్ర ఎన్నటికీ తుడిచిపెట్టుకుపోదని స్పష్టం చేశారు. ఓ ఇంటిని చూసి ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. గతంలో ఈ ఇంటికి నిప్పు పెట్టారని, ఇప్పుడు పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని ఆవేదన చెందారు.

18 మెడికల్ కాలేజీలకు షోకాజ్ నోటీసులు

న్యూఢిల్లీ: ర్యాగింగ్ నిరోధక నిబంధనలు అమలుజేయటం లేదంటూ దేశవ్యాప్తంగా 18 మెడికల్ కాలేజీలకు యూజీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరి నుంచి రెండేసి, ఏపీ, బీహార్ నుంచి మూడు చొప్పున, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నుంచి ఒక్కో వైద్య కాలేజీకి నోటీసులు జారీ అయ్యాయి. జాబితాలో తెలంగాణ నుంచి ఉస్మానియా మెడికల్ కాలేజ్, ఏపీ నుంచి ఆంధ్రా మెడికల్ కాలేజ్ (విశాఖ), గుంటూరు మెడికల్ కాలేజ్, కర్నూలు మెడికల్ కాలేజ్ ఉన్నాయి. ర్యాగింగ్ కట్టడికి యాంటీ ర్యాగింగ్ రెగ్యులేషన్స్-2009 నిర్దేశించిన నిబంధనలను ఈ కాలేజీలు అమలుచేయలేదని యూజీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. షోకాజ్ నోటీసులపై వారంలోగా వివరణ ఇవ్వాలని, లోపాలను సరిదిద్దేందుకు తీసుకునే చర్యలను వివరించాలని ఆయా విద్యాసంస్థలను ఆదేశించింది.

సరైన పత్రాలుంటేనే ఎంట్రీ!

- **కఠిన చర్యల దిశగా ట్రంప్ సర్కారు**
- **విద్యార్థులు వర్క్ చేయడంపై ఆంక్షలు**
- **ఇకపై పార్ట్‌టైమ్ జాబ్‌లూ కష్టమే**
- **నిబంధనలు అతిక్రమించిన వారి హెచ్1బీ రద్దు అవుతుంది**
- **ఎఫ్1, విజిట్ వీసాలపైనా ఆంక్షలు**
- **భారతీయుల డాలర్ డ్రీమ్స్ ఆవిరి**
- **పట్టుబడితే బహిష్కరణ, జరిమానా**
- **మళ్లీ యూఎస్‌కు ప్రవేశం నిషేధం**
- **గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ (జీటీఏ) ఫౌండర్ అండ్ చైర్మన్ కే విశ్వేశ్వర్‌రెడ్డి ఇంటర్వ్యూ**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వస్తే అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటానన్న ట్రంప్.. ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. దీంతో భారతీయ విద్యార్థుల డాలర్ డ్రీమ్స్ ఆవిరవుతున్నాయి. బైడెన్ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి ఆంక్షలేమీ లేకపోవడంతో స్టడీ వీసాపై వెళ్లిన వాళ్లు అక్కడ పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకునేవారు. ట్రంప్ రాకతో ఒక్కసారిగా అమెరికాలో సీన్ మారిపోయింది. తాజా పరిణామాలు భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్(జీటీఏ) ఫౌండర్ అండ్ చైర్మన్ కే విశ్వేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అమెరికాలో తాజా పరిస్థితులపై ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు.

- **ప్రశ్న:** అక్రమ వలసదారులపై ట్రంప్ కొరడా ఝుళిపిస్తున్నారు . దాని ప్రభావం మన విద్యార్థులపై ఏ మేరకు ఉంటుంది?

జవాబు: భారతీయ విద్యార్థులపై ఈ ప్రభావం వంద శాతం ఉంటుంది. పార్ట్‌టైం జాబ్ చేస్తూ దొరికితే సత్వరమే డిపోర్టేషన్ కింద భారతదేశానికి తిరిగి పంపేస్తారు. కాలేజీలకు కట్టిన ఫీజు సైతం మన విద్యార్థులు కోల్పోతారు.

- **ప్రశ్న:** డిపోర్టేషన్ భయంతో భారతీయ విద్యార్థులు ఉద్యోగాలు మానేస్తే అమెరికాలో వారి పరిస్థితి ఏంటి?

జవాబు: స్టడీ వీసా మీద వెళ్లినవారి తిండి, రూమ్ ఖర్చులను వారే భరించాలి. కోర్సు పూర్తయ్యే వరకు తమ వారే ఇంటి నుంచి డబ్బులు పంపాల్సి ఉంటుంది.

- **ప్రశ్న:** డిపోర్టేషన్‌లో భాగంగా స్టూడెంట్ వీసాలను కోల్పోతే వారి పరిస్థితి ఏంటి?

జవాబు: విద్యార్థులు కాలేజీలకు కట్టిన డబ్బులు కోల్పోయినట్టే. ప్రత్యామ్నాయం కూడా లేదు.

- **ప్రశ్న:** 2,467 మంది ఇప్పటికీ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్బంధంలో ఉన్నట్టు సమాచారం. వారిని స్వదేశానికి రప్పించడమెలా?

జవాబు: అక్రమంగా నివసిస్తున్నవారికి జడ్జి శిక్ష వేస్తారు. వారందరినీ జైళ్లలో ఉంచుతారు. వారికి డిపోర్టేషన్‌తో పాటు జరిమానా విధిస్తారు. మళ్లీ అమెరికా వీసా వచ్చే వీలుండదు. ఇతర దేశాలకు మాత్రం వెళ్లొచ్చు. అందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- **ప్రశ్న:** హెచ్1బీ, ఎఫ్1, విజిట్ వీసాలపై ఆంక్షలు ఎలా ఉండబోతున్నాయి?

జవాబు: హెచ్1బీ వీసా పొందినవారు నిర్దేశిత కంపెనీలో మాత్రమే పని చేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే వారికీ డిపోర్టేషన్ విధిస్తారు. ఎఫ్1 వీసా హోల్డర్లు ఆథరైజ్డ్ వర్క్ మాత్రమే చేయాల్సి ఉంటుంది. స్టోర్లలో పని చేయడానికి వీల్లేదు. అలా చేస్తూ పట్టుబడితే నిర్దాక్షిణ్యంగా స్వదేశానికి పంపేస్తారు. విజిట్ వీసా మీద వెళ్లి జాబ్ చేసేవాళ్లకూ డిపోర్టేషన్ విధిస్తారు.

- **ప్రశ్న:** ఉద్యోగం వద్దు.. తమను యూఎస్‌లో ఉండనిస్తే చాలు అన్న ధోరణి భారతీయ విద్యార్థుల్లో నెలకొంది. ఈ పరిస్థితిని ఎలా చూడొచ్చు?

జవాబు: ప్రస్తుత పరిమాణాలు భారతీయ విద్యార్థులకు కొంచెం కష్టతరంగా ఉన్నాయి. సరైన డాక్యుమెంట్లు, జాబ్ ఉంటేనే అమెరికాలో ఉండాలి. లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవు.

బర్త్, డెత్ సర్టిఫికెట్లనూ వదల్లా..!

- **ఒకేసారి 10 రెట్ల చార్జీ పెంచిన కర్ణాటక కాంగ్రెస్ సర్కారు**
- **మెట్రో చార్జీలూ భారీగా పెంపు**
- **త్వరలోనే నీటి చార్జీల వాత**

బెంగళూరు, ఫిబ్రవరి 6: ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కర్ణాటక కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు వాటిని అమలు చేయలేక ప్రజలపై రోజుకో భారం విధిస్తున్నది. అడ్డగోలుగా చార్జీలు పెంచేస్తున్నది. తాజాగా బర్త్, డెత్ సర్టిఫికెట్ల రేట్లను ఏకంగా 10 రెట్లు పెంచింది. బర్త్ సర్టిఫికెట్ రేట్‌ను రూ.5 నుంచి రూ.50కు, డెత్ సర్టిఫికెట్ రేట్‌ను రూ.2 నుంచి రూ.20కు పెంచింది. ఇది ఫిబ్రవరి 4 నుంచి అమలులోకి వస్తుందని ఉత్తర్వులిచ్చింది. అలాగే మెట్రో రైలు చార్జీలను కూడా పెంచుతున్నట్టు తెలిపింది. ఇప్పటివరకు జననం, మరణం సంభవించిన 21 రోజుల్లో నమోదు చేస్తే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ఇచ్చేవారు. అయితే ఇక నుంచి 21 నుంచి 30 రోజుల్లో దరఖాస్తు చేస్తే గతంలో వసూలు చేసే ఐదుకు బదులుగా రూ.20 వసూలు చేస్తారు. అలాగే 30 రోజుల తర్వాత ఐదు కాపీల జనన ధ్రువీకరణ పత్రాలకు గతంలో 25 వసూలు చేసేవారు. ఇప్పుడు దానిని 250కు పెంచారు. సర్టిఫికెట్ చార్జీల పెంపును బీజేపీ నేత బసన్నగౌడ పాటిల్ యత్నాల్ ఖండించారు. కాంగ్రెస్ పెట్టిన ఉచితాల భారాన్ని ఇలా చార్జీల బాదుడుతో సిద్ధరామయ్య సర్కార్ ప్రజలపై మోపుతున్నదని, వచ్చే ఎన్నికల్లో ఓటేసే సమయంలో పౌరులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు.

మెట్రో చార్జీల పెంపునకు ఓకే

బెంగళూరు మెట్రోరైలు చార్జీలను పెంచుతూ బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ గురువారం నిర్ణయించినట్టు డిప్యూటీ సీఎం శివకుమార్ వెల్లడించారు. చార్జీల పెంపు నిర్ణయం మెట్రో కమిటీ సిఫారసు మేరకు జరిగిందని, ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదన్నారు. నీటి చార్జీల పెంపు ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. 14 ఏండ్లుగా నీటి చార్జీలు పెంచకపోవడంతో బోర్డుపై ఏడాదికి వెయ్యి కోట్ల భారం పడుతున్నదన్నారు.

విద్యార్థినిపై టీచర్ల గ్యాంగ్‌రేప్

తమిళనాడులో దారుణం

కృష్ణగిరి: తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినిపై ముగ్గురు ఉపాధ్యాయులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ చర్యను నిరసిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ముందు నిరసన తెలిపారు. బాలిక తల్లి సోమవారం పాఠశాలకు వచ్చి జనవరి 3 నుంచి తన బిడ్డ సిక్ లీవ్ పెట్టి స్కూల్‌కు రాకున్నా పాఠశాల యాజమాన్యం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించింది. దీంతో హెడ్ మాస్టర్ బాలిక ఇంటికి వెళ్లగా, జనవరి 2, 3 తేదీల్లో తనపై ముగ్గురు ఉపాధ్యాయులు లైంగిక దాడి చేశారని, అందులో ఇద్దరు తన క్లాస్ టీచర్లేనని బాధిత బాలిక తెలిపింది. బాలికపై లైంగిక దాడి ఘటన నేపథ్యంలో స్టాలిన్ సర్కార్‌పై విపక్షాలు ధ్వజమెత్తాయి.

ఒక్కో అభ్యర్థికి 15 కోట్లు ఆఫర్

బీజేపీపై ఆప్ ఆరోపణలు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ని చీల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ఒక్కో అభ్యర్థికి రూ.15 కోట్లు ఇస్తామంటూ తమ అభ్యర్థులను ప్రలోభపెట్టేందుకు బీజేపీ ప్రయత్నించిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. ఓట్ల లెక్కింపు మొదలుకాకముందే తన ఓటమిని బీజేపీ ఒప్పుకున్నట్టు అయ్యిందని ఆయన విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో చేసినట్టుగా ఢిల్లీలోనూ పార్టీలను చీల్చే పని బీజేపీ చేపట్టిందని అన్నారు. ఏడుగురు ఆప్ అభ్యర్థులకు బీజేపీ నుంచి ఫోన్ కాల్స్ వెళ్లాయని చెప్పారు.

లింక్‌పై క్లిక్ చేయకున్నా

ఫోన్ హ్యాక్!

యూజర్లకు వాట్సాప్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: 24 దేశాలకు చెందిన సుమారు 90 మంది ఫోన్లను స్పైవేర్ ద్వారా హ్యాకర్లు హ్యాక్ చేశారని వాట్సాప్ వెల్లడించింది. బాధితుల్లో పాత్రికేయులు, పౌర సమాజ సభ్యులు ఉన్నారని, ఇజ్రాయెల్ కంపెనీ పారగాన్ సొల్యూషన్స్‌కు చెందిన హ్యాకింగ్ టూల్ దీనికి పాల్పడిందని తెలిపింది.బాధితుల్లో యూరప్‌వాసులు ఎక్కువగా ఉన్నారు. పారగాన్ స్పైవేర్ జీరో-క్లిక్ విధానంలో పనిచేస్తుందని హ్యాకింగ్ నిపుణులు వెల్లడించారు. యూజర్లు ఎలాంటి లింక్‌లు క్లిక్ చేయకపోయినా వారి ఫోన్లు హ్యాక్ అవుతాయి.

ల్యాండ్‌లైన్ యూజర్లు 10 అంకెలను డయల్ చేయాల్సిందే!

న్యూఢిల్లీ: ట్రాయ్ గురువారం చేసిన సిఫారసులను కేంద్రం ఆమోదిస్తే, ల్యాండ్‌లైన్ యూజర్లు లోకల్ కాల్స్ కోసం 10 అంకెలను తప్పనిసరిగా డయల్ చేయాల్సి రావచ్చు. బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ల కోసం ఫిక్స్‌డ్ లైన్ ఫోన్ నంబర్లకు గిరాకీ పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో తగిన ప్రణాళికను రూపొందించాలని టెలికం శాఖ ట్రాయ్‌ను కోరింది. ల్యాండ్‌లైన్‌కు 10 అంకెల ఫోన్ నంబరును ఇస్తే, ల్యాండ్‌లైన్ నుంచి ల్యాండ్‌లైన్‌కు ఫోన్ చేయాలంటే, మొదట సున్నాను డయల్ చేసి, ఆ తర్వాత ఎస్‌టీడీ కోడ్‌ను, అనంతరం సబ్‌స్క్రైబర్ నంబరును డయల్ చేయాలని ట్రాయ్ సిఫారసులు పేర్కొన్నాయి.

కూలుతున్న స్టార్‌లింక్స్

- **జనవరిలోనే 120కి పైగా భూ వాతావరణంలోకి**
- **అనంతరం మండిపోతున్న శాటిలైట్లు**
- **భారీగా వాతావరణ కాలుష్యం**
- **పర్యావరణవేత